

మెడికల్ కళాశాలకు 'పింగళి' పేరు

మచిలీపట్నం: మచిలీపట్నం మెడికల్ కళాశాలకు జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య పేరును పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జీఓ నంబర్ 132 విడుదల చేసింది.



యార్డుకు 28,668 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 28,668 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 26,408 అమ్మకాలు జరిగాయి.

విగ్రహాల ప్రతిష్ట



కర్లపాలెం: గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట సోమవారం నక్కలవానిపాలెంలో అత్యంత వైభవంగా జరిగింది. ఆలయం బయట పోతురాజుస్వామి విగ్రహాన్ని ప్రతిష్టించారు.

న్యూస్‌రీల్

డీఎస్సీ ఉచిత శిక్షణ దరఖాస్తు గడువు పొడిగింపు

నెహ్రూనగర్: జిల్లాలో ప్రతిభావంతులైన పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో డీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణ నమోదు గడువును ఈ నెల 21 నుంచి 25 వరకు పొడిగించినట్లు ఎస్సీ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ ఉత్తీర్ణులైన వారికి నవంబర్ 3న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. అర్హులైన వారు జ్ఞానభూమి పోర్టల్‌లో సంబంధిత ధ్రువ పత్రాలతో ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రకాశం బ్యారేజ్ దిగువకు నీటి విడుదల



తాడేపల్లి రూరల్: ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు రావడంతో ఇరిగేషన్ శాఖ అధికారులు సోమవారం సాయంత్రం ప్రకాశం బ్యారేజ్ గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా జేఈ రాజేష్ మాట్లాడుతూ ఎగువ పులిచింతల ప్రాజెక్ట్, ఇతర వాగుల నుంచి 2,28,532 క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజ్‌కు వచ్చి చేరిందని తెలిపారు. బ్యారేజీ రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా, 70 గేట్లు ఐదు అడుగులు ఎత్తి దిగువకు 2,20,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని చెప్పారు. దీంతో పాటు తూర్పు డెల్టా కాలువకు 5513 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 2519 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

25లోగా దరఖాస్తుల స్వీకరణ

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): నవంబర్ 11వ తేదీన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని అబుల్ కలాం ఆజాద్ జాతీయ స్థాయి పురస్కారంతోపాటు డాక్టర్ అబ్దుల్ హఖ్ ప్రాంతీయ స్థాయి పురస్కారాలకు ఉమ్మడి జిల్లాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి షరీఫ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉర్దూ అకాడమీ ద్వారా జారీ చేసిన దరఖాస్తు ఫారాలు పూర్తిచేసి ఈనెల 25వ తేదీలోగా డాక్టర్ మహమ్మద్ ముస్తాస్, డైరెక్టర్, సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఉర్దూ అకాడమీ మలావికా విల్లా, హెచ్.బి కాలనీ భవానీపురం, విజయవాడ చిరునామాకు స్వయంగా లేదా పోస్టు, కొరియర్ ద్వారా పంపించాలని సూచించారు. పురస్కారాలకు గుంటూరు, పల్నాడు, బాపట్ల, జిల్లాల నుంచి ఉపాధ్యాయులు విద్యార్థుల పేర్లు ప్రతిపాదనలు పంపించాలని తెలిపారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



నగరంపాలెం: మధ్యాహ్న భోజన పథకం అమల్లో లోపాలుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు లేదా నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ హెల్ప్‌లైన్ నంబర్ 15100 ద్వారా తెలియజేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి అన్నారు. ఏపీ హైకోర్టు ఆదేశాల మేరకు సోమవారం రెండో విడతగా మధ్యాహ్న భోజన పథకం అమలవుతున్న పాఠశాలలను ఆమె తనిఖీ చేశారు. భారత్‌పేట, రత్నపురి కాలనీ, సంజీవయ్యనగర్, శారదాకాలనీలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. అన్నం, కూరలు ఎలా ఉన్నాయని పిల్లలను అడిగారు. పరిసరాల పరిశుభ్రత, ఆహార నాణ్యతలో రాజీపడవద్దని, రుచికరమైన భోజనాన్ని పిల్లలకు అందించాలని ఆమె సిబ్బందికి సూచించారు.

మహిళతో జనసేన నేత అసభ్య ప్రవర్తన

పట్నంబజారు: నగరంలోని పాత గుంటూరుకు చెందిన ఒక జనసేన నాయకుడు మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన చోటుచేసుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. పాత గుంటూరుకు చెందిన జనసేన పార్టీకి చెందిన ఓ డివిజన్ అధ్యక్షుడు మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు తెలుస్తోంది. అయితే సదరు మహిళ, స్థానికులు అతడికి దేహశుద్ధి చేసినట్లు చెబుతున్నారు. ఈ అంశం సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై పాత గుంటూరు పోలీసులు వివరణ కోరగా... గొడవ జరిగిన మాట వాస్తవమేనని, అయితే ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

మానని వరద గాయం..

అందని సాయం

- బొంగరాల బీడులో 600 కుటుంబాలకు మొండిచెయ్యి
- పైసా విదల్చని కూటమి సర్కారు
- పట్టించుకోని అధికారులు
- కలెక్టరేట్‌లో బాధితుల ఆవేదన

గుంటూరు వెస్ట్: అరచేతిలో వైకుంఠం చూపించి ఆనక మోసం చేయడం టీడీపీకి వెన్నతో పెట్టిన విద్య. కనీసం కూటమి ప్రభుత్వంలోనైనా మార్పు వస్తుందని భావించిన వారికి నిరాశే ఎదురైంది. పేదల విషయంలోనూ ప్రభుత్వ వైఖరి మారకపోవడం విచారకరం. ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలు, కృష్ణా నదికి వచ్చిన అకాల వరద కారణంగా ఎన్నో కుటుంబాలు అతలాకుతలమైపోయాయి. స్థానిక బొంగరాల బీడు, కస్తూరిపేట తదితర ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. అధికంగా పేదల, వెనుకబడిన వర్గాలు నివసించే ఈ ప్రాంతాల్లోని ఇళ్లు దారుణంగా దెబ్బతిన్నాయి. నిలువ నీడ లేకుండా పోయింది. ఇంట్లో వస్తువులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు పాడైపోయి, జీవనోపాధికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఆదుకోవాల్సిన ప్రభుత్వం మొహం చాటేయడంతో బాధితులు రోడ్డెక్కారు. న్యాయం చేయాలని కలెక్టరేట్ గుమ్మం తొక్కారు.

పరిహారం పేరుతో పచ్చి దగా



న్యాయం కోరుతూ కలెక్టరేట్‌కు వచ్చిన బాధితులు

పట్టించుకోని అధికారులు

ఇటీవల వరదలకు నగరంలో సుమారు 600 ఇళ్లు దెబ్బతినడంతోపాటు వస్తువులు ఎందుకూ పనికి రాకుండా పోయాయి. బాధితులు రోడ్డున పడ్డారు. ప్రభుత్వం అందిస్తామన్న రూ.10 వేలు వరద సాయం కనీసం ఇందులో ఐదు శాతం మందికి కూడా అందలేదు. నష్టాన్ని అంచనా వేసేందుకు వెళ్లినన సచివాలయ సిబ్బంది తూతూమంత్రంగా పని ముగించారు. అప్పటి నుంచి ఎన్నో విధాలుగా వరద సాయం కోసం ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోగా అవమానకరంగా మాట్లాడారని బాధితులు వాపోతున్నారు. సుమారు 200 మంది వీసీకే (విడుదలై చిరుతల కక్షి) పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కె.జయసుధ ఆధ్వర్యంలో సామాజిక కార్యకర్తలతో కలిసి సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులు అందించారు. జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజకు సమస్యలను వెళ్లబోసుకున్నారు. వారిలో కొందరి అభిప్రాయాలు...



భారీ వర్షాల కారణంగా బొంగరాల బీడులోని ఇళ్లల్లోకి చేరిన నీరు (ఫైల్)

సమస్యలు కూడా వినడంలేదు



వరద కారణంగా కొన్ని వందల కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయి. ఎన్నోసార్లు ఫిర్యాదులు చేసినా కనీసం పట్టించుకోవడంలేదు. పట్టణ ప్రాంతంలోనే వరద నష్టాన్ని ఇంత దారుణంగా అంచనా వేస్తే ఇక మారుమూల ప్రాంతాల్లో ఎలా చేసి ఉంటారో అర్థం చేసుకోవచ్చు. పేదల ప్రభుత్వమని చెప్పుకోవడంకాదు.. వారికి కనీస న్యాయం చేయాలి. బాధితులకు సాయం అందే వరకు పోరాటం చేస్తాం.

– కె.జయసుధ, వీసీకే పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు

దాతలు ఇస్తున్నారు కదా !



వరద నష్టాన్ని గుర్తించిన దాతలు సుమారు రూ.500 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు. ప్రతి ఇంటికీ నష్టపరిహారం అని చెప్పిన ముఖ్యమంత్రి పట్టణ ప్రాంతాల్లో పేదలనే విస్మరించారు. ఇబ్బందులను చెబితే కనీసం విచారణ కూడా చేయడంలేదు. నష్టపోయిన కుటుంబాలకు కనీసం సాయం కింద రూ.10 వేలు అందించాలి.

– వాసు, బీఎస్పీ నాయకుడు.

ఆగిపోయిన జీవనోపాధి



వర్షాల కారణంగా మా అబ్బాయి నడుపుకునే ఆటో పూర్తిగా మునిగిపోయింది. జీవనోపాధి ఆగిపోయింది. ద్విచక్ర వాహనం కూడా పాడయ్యింది. దీంతోపాటు కొన్ని వస్తువులు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాం. వరద సాయం చేస్తే ఆటోను బాగు చేసుకుంటాం.

– సీహెచ్.సునీత, బొంగరాలబీడు.

సామాన్లు పూర్తిగా పాడయ్యాయి



ఇంట్లో టీవీ సహా అన్ని సామాన్లు, మంచాలు, పరుపులు పనికిరాకుండా పోయాయి. ఇప్పటికీ చాలా వరకు ఉపయోగంలో లేవు. వరద సమయాల్లోనూ ఆదుకోకపోతే మాకు ఎవరు సాయం చేస్తారు. ఇప్పటికే పనులు దొరక్క, ఉపాధిలేక ఇబ్బందులు పడుతున్నాం.

– బి.గురవమ్మ, గుంటూరు

ఫిర్యాదు చేసినా ఫలితం లేదు



ప్రకృతి వైపరీత్యాలప్పుడు కాకపోతే ప్రభుత్వం ఇంకెప్పుడు ఆదుకుంటుంది ? ఇప్పటి దాకా ఎందరినో కలిసి ఫిర్యాదు చేశాం. కనీసం సిబ్బంది అయినా వచ్చి విచారించడం లేదు. నష్టం జరిగిందని, న్యాయం చేయమంటున్నా స్పందించడంలేదు.

– సీహెచ్. మీనాక్షి, కసురిపేట, గుంటూరు

అర్హత లేకున్నా పట్టం

స్టేజీ–1 టెండర్లలో అక్రమాలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: పౌరసరఫరాల శాఖ నిర్వహించే స్టేజీ–1 ట్రాన్స్‌పోర్టు టెండర్లలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయి. మూడు జిల్లాల్లో అనర్హత వేటు పడిన కాంట్రాక్టర్‌ను గుంటూరు జిల్లాలో మాత్రం టెక్నికల్ బిడ్‌లో అర్హుడిగా చూపించడంపై ఆరోపణలు వస్తున్నాయి. రాజకీయ ఒత్తిళ్లతోనే ఈ టెండర్ల ప్రక్రియ జరుగుతున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో పౌరసరఫరాల శాఖకు సంబంధించి సెంట్రల్ వేర్ హౌస్ గోదాముల నుంచి మండల స్థాయి స్టాక్ పాయింట్ల వరకూ సరుకులు సరఫరా చేసేందుకు ఈ టెండర్లు పిలిచారు. దీనికోసం ట్రాన్స్‌పోర్టు వాహనాలు సమకూర్చాల్సి ఉంటుంది. గుంటూరు జిల్లాకు తొమ్మిది నుంచి 10 పాయింట్లు ఉండగా 20 వరకూ వాహనాలు అవసరం అవుతాయి. దీనికి గత అనుభవం ఉండాలి. లేనివారు రెట్టింపు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. టర్నోవర్, సంస్థ రిజిస్టర్ అయివుండాలి. ఇన్‌కంట్యాక్స్ సర్టిఫికెట్‌తో పాటు స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీగా ఎంఎస్ఎంఈలో నమోదు అయి ఉండాలి. ఉషోదయ ట్రాన్స్‌పోర్టు కంపెనీని అనకాపల్లి, ఎఎస్ఆర్ జిల్లాతో పాటు పల్నాడు జిల్లాలో జాయింట్ కలెక్టర్ల నివేదిక ఆధారంగా అనర్హత వేటు వేశారు. ఈ సంస్థ మీడియం ఇండస్ట్రీగా నమోదు అయి ఉండటం, ఈఎండీ చెల్లించకపోవడం, వీరి పనితీరు బాగోని కారణంగా మూడు జిల్లాల్లో అనర్హత వేటు వేశారు. అదే వ్యక్తిని గుంటూరు జిల్లాలో సాంకేతికంగా అర్హత ఉన్నట్లు చూపించడంపై మిగిలిన కాంట్రాక్టర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల రిజిస్టర్డ్ పార్టనర్‌షిప్ డీడ్ లేకుండా కూడా కొన్ని సంస్థలకు సాంకేతిక అర్హత ఉన్నట్లు చూపించారు. రాజకీయ ఒత్తిళ్లకు పౌరసరఫరాల అధికారులు లొంగి అర్హత లేనివారిని క్వాలిఫై చేయడంపై ఫిర్యాదు చేయడానికి కాంట్రాక్టర్లు సన్నద్ధం అవుతున్నారు.

కత్తితో రౌడీషీటర్ దాడి

లక్ష్మీపురం: మద్యం మత్తులో రౌడీషీటర్ కత్తితో వ్యక్తిపై దాడి చేసిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శారదాకాలనీ ఆర్చి సెంటర్‌లోని బార్ అండ్ రెస్టారెంట్‌లో రాజీవ్‌గాంధీ నగర్ ప్రాంతానికి చెందిన సాలే ప్రసన్న కుమార్ మద్యం తాగుతున్నాడు. అదే బార్‌లో వసంతరాయపురం ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ చింతగుళ్ల ప్రవీణ్‌కుమార్ తాగుతున్నాడు. అకారణంగా మద్యం మత్తులో ప్రసన్నకుమార్‌పై కత్తితో తలపై దాడి చేశాడు. తీవ్రగాయాలు కావడంతో అతడిని స్థానికులు ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న అరండల్‌పేట పోలీసులు బార్ అండ్ రెస్టారెంట్ వద్ద ఉన్న రౌడీషీటర్ ప్రవీణ్‌కుమార్‌ను అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.





పోలీసు అమర వీరులకు లాల్ సలాం

జిల్లా పోలీస్ శాఖ అధ్వర్యంలో సోమవారం గుంటూరు నగరం పాలెంలోని ఎస్‌జిఐ ఎదురుగా ఉన్నపోలీస్ అమరవీరుల స్థూపం వద్ద సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించారు. విధి నిర్వహణలో పోలీసుల త్యాగం, ధైర్యాన్ని కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి కొనియాడారు. అమర వీరుల కుటుంబ సభ్యులకు నగదు రివార్డులు, చెక్కులను పంపిణీ చేశారు. అమర వీరుల కుటుంబాలకు అండంగా ఉంటామని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా విడిపోయినా అంతా పోలీసు కుటుంబం అని పేర్కొన్నారు.

– నగరంపాలెం

రైతుల కష్టాన్ని దోచుకునే వారిని కఠినంగా శిక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెమ్మసాని. వేదికపై కలెక్టర్, ఎస్పీ తదితరులు

మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు వెస్ట్: రైతులను మోసం చేయడం, వారి కష్టాన్ని దోచుకున్న ఎవరినైనా కఠినంగా శిక్షించాలని కేంద్ర వ్యవసాయ, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మితో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోల్డ్ స్టోరేజ్‌లో తమ పంటను నిల్వ ఉంచిన రైతులకు తెలీకుండా యజమానులు తనఖాపెట్టి అక్రమ మార్గంలో నకిలీ పేర్లతో బ్యాంకు రుణాలు పొందడం ధారుణమని ఖండించారు. కలెక్టర్‌తోపాటు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ నిందితుల ఆస్తులను రికవరీ చేయడం అభినందనీయమని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ గత నెల 30న కోల్డ్ స్టోరేజ్ యజమానుల మోసం వెలుగుచూసిందన్నారు. పోలీసు శాఖ సహకారంతో కేవలం రెండు వారాల్లోనే విచారణ ముగించి సొమ్మును నిందుల నుంచి రికవరీ చేశామని తెలిపారు. అనంతరం మంత్రి డాక్టర్ పెమ్మసానితోపాటు కలెక్టర్, ఎస్పీ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు కలిసి రాఘవేంద్ర, తియ్యగూర కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ ఉంచి నష్టపోయిన 32 మంది రైతులకు రూ. కోటి విలువైన చెక్కులను అందజేశారు. సమావేశంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, మార్కెటింగ్ శాఖ ఏడీ రాజబాబు పాల్గొన్నారు.

చోరీ కేసులో పని మనిషి అరెస్టు

- రూ. 37లక్షలు అపహరణ
- కేసు ఛేదించిన రూరల్ పోలీసులు

మంగళగిరి: మండలంలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట ఉన్న మిడ్ వ్యాలీ సిటీలో జరిగిన చోరీని రూరల్ పోలీసులు ఛేదించారు. సీఐ వై. శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. మిడ్‌వ్యాలీ సిటీలోని డాక్టర్ ఇంట్లో ఓ మహిళ పని మనిషిగా చేరింది. నాలుగు నెలలుగా విడతల వారీగా రూ. 37లక్షలు చోరీ చేసింది. ఇటీవల నగదుతో డైమండ్ నల్లపూసల గొలుసు చోరికి గురికాగా యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు. పని మనిషిపై అనుమానంతో విచారించగా అసలు విషయం బయటపడిందని తెలిపారు. ఆమెను అరెస్ట్ చేసి నగదు, డైమండ్ గొలుసు స్వాధీనం చేసుకుని యజమానికి అప్పగించినట్లు సీఐ చెప్పారు.



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ శ్రీనివాసరావు

అర్జీల పరిష్కారంలో జాప్యాన్ని నివారించండి

జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ

గుంటూరు వెస్ట్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి స్వీకరించే అర్జీల పరిష్కారంలో జాప్యాన్ని నివారించాలని జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ అధికారుల్ని ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వ్యవహారాలన్నీ కంప్యూటర్ విధానంలోనే జరుగుతున్నాయని, ఒక శాఖ నుంచి మరొక శాఖకు అర్జీలు పంపాల్సి వచ్చినా పెద్ద సమయం కాదని చెప్పారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే అర్జీల పరిష్కారం ఆలస్యమవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. అర్జీలను వేగంగా పరిష్కరించాలని చెప్పారు. ఒకే అర్జీ పరిష్కారం కోసం పదే పదే తిప్పుకోకుండా చూడాలని తెలిపారు. పరిష్కారానికి అవకాశంలేని వాటిని వివరించి తెలపాలని ఆదేశించారు. అనంతరం వచ్చిన 190 ఫిర్యాదులను జేసీతో పాటు డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీఓ పి.శ్రీకర్, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీ కుమారి డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా అధికారులు పరిశీలించారు.



బాధితుల సమస్యలు వింటున్న జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ

దళితుల సమస్యలు పరిష్కరించండి



రాజ్యాంగం దళితులకు కల్పించిన హక్కులు కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా మాకు అందడంలేదు. అట్రాసిటీ కేసుల్లో రావాల్సిన మొత్తాలు అందడంలేదు. దళిత బిడ్డలపై అత్యాచారాలు, వేధింపులు జరుగుతున్నాయి. వాటి విచారణ వేగవంతం చేయాలి. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల్లో మాదిగలకు అవకాశం కల్పించండి.

– టి.ఏసుపాదం మాదిగ తదితరులు

కేసు విచారణ త్వరగా పూర్తి చేయండి



స్థానిక బ్రెయిలీ ప్రెస్‌లో మహిళా ఉద్యోగినిని లైంగిక వేధింపులకు గురి చేసిన సహచర అధికారిపై విచారణ ఎందుకు నిలిపివేశారు ? మహిళలపై వేధింపులకు గురిచేసిన వారిని ఉపేక్షించవద్దు. విచారణ త్వరగా పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయండి.

–షేక్ ఖాలేషా, రాష్ట్ర అధ్యక్షుడు, నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి

సమస్యల పరిష్కారానికి కేబినెట్ సబ్ కమిటీని నియమించాలి

గుంటూరు మెడికల్: ఉద్యోగుల ,ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే కేబినెట్ సబ్ కమిటీని నియమించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా కోరారు. గుంటూరు మెడికల్ కాలేజ్ ఆవరణలోని సంఘం జిల్లా కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. చాంద్‌బాషా మాట్లాడుతూ ఉద్యోగుల బకాయిలు, జీపీఎఫ్ బకాయిలు, సరెండర్ లీవ్ బిల్లులు, ఏపీజీఎల్ఐ బకాయిలు తక్షణమే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. 12వ వేతన సవరణ సంఘం అంశాలపై చర్చించడానికి కేబినెట్ సబ్ కమిటీని నియమించాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు , ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనంపై చర్చించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కె.వి.యస్. శివారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరిముల్లా షాఖాదిరి, జిల్లా సంయుక్త కార్యదర్శి మణికంత, నగర శాఖ సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, నగర శాఖ కోశాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చాంద్ బాషా

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **4,000** గరిష్ఠం : రూ. **5,200**

మోడల్ ధర రూ. **4,500**

క్లుప్తంగా

అంతర్జాతీయ ఆర్ట్ గ్యాలరీకి రత్నబాబు చిత్రాలు ఎంపిక



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫైన్ ఆర్ట్స్ విభాగ అధ్యాపకుడు బి. జాన్ రత్నబాబు గీసిన చిత్రాలు అంతర్జాతీయ చిత్ర కళా ప్రదర్శనకు ఎంపికయ్యాయి. యూకేకు చెందిన 'సారాస్ ఇంటర్నేషనల్ ఆర్టిస్ట్ ఎంపవర్మెంట్ కలెక్టివ్' పేరుతో ఆర్ట్ ఎగ్జిబిషన్ నవంబర్ 22 నుంచి 25 వరకు జరగనుంది. ఈ ఎగ్జిబిషన్‌కు 10 దేశాల నుంచి 12 మంది ఆర్టిస్టుల చిత్రాలు ఎంపికయ్యాయి. అందులో నాగార్జున విశ్వవిద్యాలయానికి చెందిన జాన్ రత్నబాబు చిత్రాలు కూడా ఉన్నాయి. భారత దేశం నుంచి ఇద్దరు చిత్రకారులకు మాత్రమే ఈ అవకాశం లభించింది. జాన్ రత్నబాబు పంపిన ఐదు చిత్రాలను ఆ గ్యాలరీ ప్రదర్శనలో ఉంచుతారు.. ఈ మేరకు సోమవారం సారాస్ ఆర్ట్ గ్యాలరీ నిర్వాహకులు సారా నుంచి జాన్ రత్నబాబుకు సమాచారం అందింది.

6న స్వర్ణకార సంఘ ఎన్నికలు

నెహ్రూనగర్: గుంటూరు జిల్లా స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో పట్టణ సంఘం ఎన్నికలు నవంబర్ 6న నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ తెలిపారు. లాలాపేటలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 20 రోజులుగా పట్టణ స్వర్ణకారుల ఓటు నమోదు ప్రక్రియ చేపట్టామని, ఇందులో భాగంగా ఇద్దరు ఎన్నికల బరిలో ఉన్నట్లు చెప్పారు. పఠాన్ మహమూద్, సయ్యద్ ఇబ్రహీం బాషాలు రెండు ప్యానల్స్‌గా నామినేషన్లు వేశారని, గుర్తులు కూడా కేటాయించినట్లు తెలిపారు. మహమూద్‌కి తాసు, ఇబ్రహీంకి బల్బు గుర్తు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఎన్నికలకు కన్వీనర్స్‌గా జింకా దివ్య నారాయణ, కడారు వెంకటేశ్వరరావు వ్యవహరిస్తారని వివరించారు.

మలేరియా రహిత దేశంగా తీర్చిదిద్దేందుకు కృషి

తెనాలి అర్బన్: 2030 నాటికి మలేరియా రహిత దేశంగా ప్రభుత్వం తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిందని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పేర్కొన్నారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో నాజరుపేట, చెంచుపేటలలో దోమల నియంత్రణపై ఇంటింటి ప్రచారాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2027 నాటికి ఒక్క కేసు కూడా నమోదు కాకుండా చూసేందుకు ప్రయత్నిస్తున్నామని, ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు.

పోలీసుల త్యాగం, సేవలు ప్రశంసనీయం

- జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి
- పోలీసుల అమరవీరుల స్తూపం వద్ద నివాళులు

నగరంపాలెం: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు కీలకపాత్ర పోషిస్తున్నారని, వారి సేవలు, త్యాగం ప్రశంసనీయమని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి కొనియాడారు.జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు నగరంపాలెంలోని ఎస్‌బీఐ ఎదురుగా ఉన్న అమర వీరుల స్తూపం వద్ద సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎందరో పోలీసులు ప్రాణాల్ని సైతం అర్పిస్తున్నారని, వారి ధైర్యం, సేవల్ని అన్ని వేళల్లోనూ ప్రజలు గుర్తుంచుకోవాలని సూచించారు. సమాజంలో పోలీసుల పాత్ర చాలా కీలకమని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజల హక్కులు, శాంతిభద్రతలు కాపాడటం కోసం పోలీసులు అందిస్తున్న సేవలు అమూల్యమని తెలిపారు. ప్రజల ఆకాంక్షలు ఇంకా నెరవేర్చి వారి మన్ననలు పొందాలని సూచించారు.

పోలీస్ ఉద్యోగమంటే చాలెంజ్ : ఎస్పీ

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో గతేడాదిలో 12 మంది విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించారని తెలిపారు. ప్రతి రోజూ పోలీస్ ఉద్యోగమంటే ఒక చాలెంజ్‌లా స్వీకరించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం అమరుల కుటుంబ సభ్యులకు నగదు రివార్డులు, చెక్కులను పంపిణీ చేశారు. అమరవీరుల స్తూపం వద్ద పుష్ప గుచ్ఛాలతో నివాళులర్పించారు. ఈ క్రమంలో స్తూపం వద్ద అమరవీరుల కుటుంబ సభ్యులు వద్ద



పోలీసు అమర వీరుల కుటుంబసభ్యులకు చెక్కులు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి. చిత్రంలో ఎస్పీ సతీష్ కుమార్, ఏఎస్పీ సుప్రజ తదితరులు

కన్నీటి పర్యంతరమయ్యారు. తొలుత పోలీస్ సిబ్బంది కవాతు నిర్వహించారు. ప్లకార్డులతో నగరంపాలెం మూడు బొమ్మల కూడలి నుంచి అమర వీరుల స్తూపం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీలు జి.వి.రమణమూర్తి (పరిపాలన), కె.సుప్రజ (క్రైం), హనుమంతు (ఏఆర్), డీఎస్పీలు అబ్దుల్ అజీజ్ (తూర్పు), జయరాంప్రసాద్ (పశ్చిమ), శాంతకుమార్ (ఏఆర్), రమేష్ (ట్రాఫిక్), సీఐలు, ఎస్ఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, విశ్రాంత పోలీస్ అధికారులు, పోలీస్ అసోసియేషన్ సభ్యులు, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం

పోలీస్ అమరవీరుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో అమరులైన పోలీసు కుటుంబ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాతోపాటు గుంటూరు జిల్లాలో ఉంటున్న ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని చెప్పారు. కుటుంబ అవసరాల నిమిత్తం నగదు పంపిణీ చేశారు. ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా సంప్రదించాలని తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా విడిపోయినా మనమంతా పోలీసు కుటుంబం అని చెప్పారు.



అమరులైన పోలీసులకు మౌనం పాటిస్తున్న పోలీసులు



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

ఆహ్వానం లేదని బాధిత కుటుంబాల ఆవేదన



కార్యక్రమానికి ఆహ్వానం లేదంటూ కుటుంబసభ్యుల రోదన

సంస్మరణ సభ కార్యక్రమానికి తమకు ఆహ్వానం లేదంటూ అమరవీరుల కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతరమయ్యారు. గత ఇరవై ఏళ్లకు పైగా ఏటా జరిగే సభకు విధిగా సమాచారం చేరవేసేవారని, ఈ దఫా పిలవలేదని రోదించారు. దీనిపై గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఎదుట మొరపెట్టుకున్నారు. గతంలో ప్రతిసారి తమను గుర్తుపెట్టుకుని ఆహ్వానించే వారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో డీపీఓలో కలవాలని ఆయన సూచించారు. మహిళలు సైతం కన్నీరుమున్నీరయ్యారు. ఏటా పిలిచే వారని ఈసారి పిలవలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇదే విషయాన్ని గుంటూరు తూర్పు డీఎస్పీ అబ్దుల్ అజీజ్ వద్ద కూడా ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది.

రూ.10 నాణేలు చట్టబద్ధమైనవి

బ్యాంక్ ఆఫ్ బరోడా రీజినల్ మేనేజర్ కిరణ్‌రెడ్డి



నాణేలను ఎక్సేంజ్ చేస్తున్న కిరణ్‌రెడ్డి, వెంకటరమణరావు, ప్రసన్న తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): పది రూపాయల నాణేలు చట్టబద్ధమైనవని, రోజువారీ లావాదేవీలకు ఉపయోగించవచ్చని బ్యాంక్ ఆఫ్ బరోడా(బీఓబీ) రీజినల్ మేనేజర్ ఎస్.కె.కిరణ్‌రెడ్డి తెలిపారు. స్థానిక లక్ష్మీపురంలోని బీఓబీ బ్రాంచ్ ఆధ్వర్యంలో రూ. పది నాణేలపై సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చాలా మందిలో నాణేం చెల్లదన్న అపోహ ఉందని, దాన్ని పోగొట్టేందుకే సదస్సు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పది రూపాలయ నాణేలు 14 రకాలు ఉన్నాయని, వ్యాపారవేత్తలు, నగర ప్రజలు వాటిని వాడుక చేయాలని సూచించారు. ఇందులో భాగంగా రూ.60 వేల విలువ గల నాణేలు వినియోగదారులకు ఎక్స్చేంజ్ చేశారు. సదస్సులో బీఓబీ లక్ష్మీపురం బ్రాంచ్ హెడ్ కె.వెంకటరమణరావు, అధికారులు ప్రసన్న, శ్రీనివాసరావు, అశ్వత్థ నారాయణ, ఖాతాదారులు సంజీవరెడ్డి, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కత్తి పద్మారావుకు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ ఆహ్వానం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కత్తి పద్మారావు

పొన్నూరు: కులమత భేదాలు లేకుండా మానవ హక్కుల కోసం పోరాడి 1989 ప్రివెన్షన్స్ ఆఫ్ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ తీసుకు వచ్చేందుకు కృషి చేసిన కవి డాక్టర్ కత్తి పద్మారావు అభినందనీయులని ప్రొఫెసర్ డాక్టర్ కనపర్తి అబ్రహం లింకన్ కొనియాడారు.పట్టణంలోని లుంబినీ వనంలో గల కార్యాలయంలో సోమవారం ఆయన్ను అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కమిటీ సభ్యులు కలిశారు. తెనాలి ప్రాంతంలోని చినరావూరులో డిసెంబర్ 6న విగ్రహావిష్కరణ చేసేందుకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ జీవిత విశేషాల రచనలను ఆవిష్కరించారు. అనంతరం కత్తి పద్మారావును సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మోహన్‌రావు, కె.రాజరత్నం, ఏ. రవీంద్రబాబు, జె.దయారత్నం, ఎం. సంజీవరావు, బి. కిరణ్, ఎస్. ప్రసాద్, జి. పీటర్ పాల్ పాల్గొన్నారు.

కొల్లిపరలో అత్యధికంగా 40.6 మి.మీ. వర్షం

కొరిటెపాడు(గుంటూరు): జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా కొల్లిపర మండలంలో 40.6 మి.మీ. వర్షం పడగా, అత్యల్పంగా తుళ్ళూరు మండలంలో 1 మి.మీ. పడింది. సగటున 7.1 మి.మీ. నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. తెనాలి 20.8, ఫిరంగిపురం 15.8, దుగ్గిరాల 12.8, మేడికొండూరు 9.4, చేబ్రోలు 7.8, పొన్నూరు 7.4, గుంటూరు పశ్చిమ 3.2, వట్టిచెరుకూరు 2.4, పెదనందిపాడు 1.8, ప్రత్తిపాడు 1.8, కాకుమాను 1.4, గుంటూరు తూర్పు 1.4, తాడికొండ మండలంలో 1.2 మి.మీ. చొప్పున పడింది.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ. వేదికపై పూనూరు గౌతంరెడ్డి తదితరులు

పొన్నూరు: నియోజకవర్గంలో 2021 లోపు డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ నవంబరు 6వ తేదీలోపు తమ ఓటును నమోదు చేసుకొని 2025 మార్చిలో జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు వినియోగించి వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగించే విధంగా చేయాలని వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. సోమవారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కృష్ణ,గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నాలుగు నెలల పాలనలో ఒక్క మంచిపని చేయలేదని విమర్శించారు. తల్లికివందనం ఇవ్వలేదు కానీ నాన్నకు మాత్రం ఫుల్ బాటిల్ అందించి చంద్రబాబు తన వైఖరిని స్పష్టం చేశారని అన్నారు. నియోజకవర్గంలో 4 వేల ఓట్లు నమోదు చేసేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. కార్యాలయంలోనే ఓటు నమోదుకు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

నిరసనలు రోడ్డెక్కుతున్నాయి

పార్టీ నాయకులు పూనూరు గౌతంరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తమకిచ్చిన హామీలు నెరవేర్చక పోవడంతో నిరుద్యోగులు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు, అంగన్‌వాడీలు రోడ్డెక్కి నిరసనలు తెలుపుతున్నారని విమర్శించారు. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గౌతం రెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మలీల, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్. రూత్ రాణి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరావు, చేబ్రోలు ఎంపీపీ సాహితీ కిరణ్, న్యాయవాది బొనిగల రాజారావు, నాయకులు నాగరాజు, డాక్టర్. శివరామిరెడ్డి, షేక్. నాజర్, అంబటి వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఆవాస్ యోజన ద్వారా ఇళ్లు

మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి పార్థసారథి

నెహ్రూనగర్: అందరికీ ఇళ్లు అనేది కేవలం నినాదంగానే ఉండిపోకుండా నిజం చేసేలా దేశంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రంలో నారా చంద్రబాబు నాయుడు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా ప్రణాళికలు రూపొందిస్తున్నారని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన ప్రధాన మంత్రి అవాస్ యోజన గ్రామీణ్, ఏడబ్ల్యూఏఎస్ (ఆవాస్) ప్లస్ 2024 యాప్‌పై జరిగిన రీజనల్ లెవల్ వర్క్ షాపు, కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇల్లు లేకుండా ఎవరూ ఉండకూడదనే ఉద్దేశంతో ప్రధాన మంత్రి అవాస్ యోజన గ్రామీణ పథకం ద్వారా గృహ నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. గతంలో అస్సాం రాష్ట్రంలో కూడా పర్యటించినప్పుడు అక్కడ షేరింగ్ విధానంలో రెండు లక్షల రూపాయిలు యూనిట్ కాస్ట్‌తో నిర్మాణాలు చక్కగా జరిగాయని వివరించారు. 2024–25 సంవత్సరానికి 38 లక్షల గృహాలు దేశంలోని 17 రాష్ట్రాల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రానున్న ఐదు సంవత్సరాల్లో ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు నిర్మించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్మాణాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ సెక్రటరీ శైలేష్ కుమార్ సింగ్, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ తాతయ్య, రాష్ట్ర గృహనిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరక్టర్ రాజా బాబు, జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ డెప్యూటీ డైరెక్టర్ గవా ప్రసాద్, జార్ఖండ్ ఆర్డీపీ శ్రీనివాసన్, తాడికొండ శాసనసభ్యులు తెనాలి శ్రావణకుమార్ పాల్గొన్నారు.

సమైక్యత, సమగ్రతకు యువత పాటుపడాలి

ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె గంగాధరరావు



ఏఎన్‌యూ: జాతీయ సమైక్యత, సమగ్రతకు యువత ప్రత్యేకంగా పాటుపడాలని ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె. గంగాధరరావు పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు , క్రీడా మంత్రిత్వ శాఖ,గుంటూరు నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఆరు రోజులపాటు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహిస్తున్న 4వ కాశ్మీర్ యూత్ ఎక్స్చేంజ్ కార్యక్రమాన్ని వీసీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ జాతీయ సమగ్రత పెంపొందించడంలో యువతదే కీలకపాత్ర అన్నారు. దేశంలోని సాంస్కృతిక, పారిశ్రామిక, చారిత్రక, పర్యాటక విద్యాపరమైన ప్రముఖ ప్రదేశాలను సందర్శించే అవకాశం ఈ యువ సమ్మేళనం వల్ల కలుగుతుందని తెలిపారు. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంచాలకులు అంశుమాన్ ప్రసాద్ దాస్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కాశ్మీర్ యువతలో జాతీయ ఐక్యత, సమగ్రతను పెంపొందించే లక్ష్యంతో యువ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కిరణ్మయి మాట్లాడుతూ వివిధ అంశాలపై వర్క్‌షాప్‌లతోపాటు రెండు రోజుల క్షేత్ర స్థాయి సందర్శనలతో కార్యక్రమం జరగనుందని వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, ఓఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి. విజయలక్ష్మి, విశాఖపట్నం జిల్లా నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ జి. మహేశ్వరరావు ప్రసంగించారు. కాశ్మీరీ యువత సాంస్కృతిక ప్రదర్శనతో సందడి చేశారు.

విజ్ఞాన్‌లో కబడ్డీ పోటీలు ప్రారంభం



టోర్నమెంట్‌లో తలపడుతున్న జట్లు

గుంటూరు రూరల్: పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల కబడ్డీ టోర్నమెంట్‌ను సోమవారం ప్రారంభించారు. ఏఎన్‌యూ పరిధిలోని వివిధ డిగ్రీ కళాశాల నుంచి 18 టీంలు పాల్గొన్నాయి. సందర్భంగా విజ్ఞాన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వి. అనురాధ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరమని తెలిపారు. విజ్ఞాన్ నిరుల ప్రిన్సిపాల్ డాక్టర్ పాతూరి రాధిక మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ఒత్తిడి గురికాకుండా ఉంటారని తెలియజేశారు. విజ్ఞాన్ యూనివర్సిటీ పీడీ, అసోసియేషన్ అధ్యక్షుడు పి.పి.ఎస్. పాల్‌కుమార్ మాట్లాడుతూ సౌత్ జోన్‌లో విజయం సాధించిన టీమ్స్‌కి యూనివర్సిటీలో నగదు ప్రోత్సాహంతో పాటు మార్కులను కూడా ఇస్తామని తెలిపారు. పోటీలను సెక్రటరీ ప్రతాప్, హరికృష్ణ పర్యవేక్షించారు. కార్యక్రమంలో నాగార్జున యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పాతూరి శ్రీనివాస్, నాగార్జున యూనివర్సిటీ టీం సెలక్షన్ కమిటీ మెంబర్స్ గణేష్, ప్రేమ్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్స్ పాల్గొన్నారు.

రూ. లక్షలు కాజేసి నట్టేట ముంచారు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో బాధితుల ఆవేదన న్యాయం చేయాలని పోలీసులకు వినతి



బాధితురాలితో మాట్లాడుతున్న జిల్లా ఏఎస్పీ రమణమూర్తి

నగరంపాలెం: స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. బాధితుల నుంచి జిల్లా ఏఎస్పీ జీవీ రమణమూర్తి (పరిపాలన) అర్జీలు స్వీకరించారు. బాధితులు సమస్యల్ని విన్నవించారు. ఆయన వారి బాధలను ఆలకించారు. ఈ క్రమంలో అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని సబ్ డివిజన్ల పోలీస్ అధికారులను ఆదేశించారు. డీఎస్పీలు సుబ్బారావు (మహిళా పీఎస్), రమేష్ (ట్రాఫిక్) కూడా అర్జీలు స్వీకరించారు.

మృతికి తెలిసిన వారే కారణం

కుమారుడు మణికంఠ (19) ఓ మిల్క్ కంపెనీలో ఫిట్టర్‌గా చేసేవాడు. గత నెల్లో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాం. కుమారుని మృతికి తెలిసిన వారే కారణమని ఫిర్యాదులో పేర్కొన్నాం. చనిపోయే ముందు తెలిసిన వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడినట్లు కాల్‌డేటాలో గుర్తించాం. ఈ క్రమంలో సదరు వ్యక్తిని పిలిచి విచారిస్తే అసలు విషయం వెలుగులోకి వస్తోంది. తమకు న్యాయం చేయగలరని కోరుతున్నాం.

– నేలపాటి మేరి, దాసు, గుండాలపాడు, ఫిరంగిపురం

దఫాల వారీగా మోసం

గతంలో వ్యవసాయం చేసేవాడ్ని. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా ఖాళీగా ఉంటున్నా. గతంలో ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న సమయంలో వరుసకు బంధువైన వ్యక్తి దగ్గరయ్యాడు. ఈ క్రమంలో ఆస్పత్రి, ఇతరత్రా ఖర్చులంటూ ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు సుమారు రూ.30 లక్షల వరకు తీసుకున్నాడు. అదిగాక పది సవర్ల బంగారు గొలుసు లాగేసుకున్నాడు. దీంతో నగదు, నగలు ఇవ్వాలని అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నాడు. ప్రస్తుత పరిస్థితుల్లో చాలా ఇబ్బందిగా ఉంది. అతన్ని పిలిచి విచారించి, న్యాయం చేయగలరు. –వై.రాఘవయ్య, పొన్నూరు

బిల్డర్ మోసం



తెనాలి వీఎస్ఆర్ కళాశాలకు దగ్గర్లో ఓ బిల్డర్ అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టారు. అతని వద్ద నాతో పాటు భర్త, కుమార్తె మూడు ఫ్లాట్‌లను కొనుగోలు చేశాం. సుమారు 18 నెలలు క్రితం రిజిస్ట్రేషన్ చేశారు. మిగిలిన పనులు పూర్తి చేసి ఫ్లాట్‌లను అప్పగించలేదు. కనీసం మిగతా పనులను చేయించుకుంటామని చెప్పినా బిల్డర్ అడ్డుపడుతున్నాడు. ఇటీవల నా భర్తను బెదిరించి, చంపుతానని హెచ్చరించాడు. ఈ క్రమంలో భర్తకు గుండెపోటు రాగా, శస్త్రచికిత్స చేయించుకున్నాం. ఇప్పటికైనా ఫ్లాట్ పనులు పూర్తి చేసి అప్పగించాలని లేదా చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరుతున్నాం. సమస్యను సీఎం చంద్రబాబు, మంత్రి నాదెండ్ల మనోహర్, టీడీపీ నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్ దృష్టికి తీసుకెళ్తాం. అతనిపై చట్టప్రకారం విచారించి, న్యాయం చేయగలరు.

– కొత్రపాటి లక్ష్మి, ఆరో వార్డు కౌన్సిలర్, పక్కన భర్త శ్రీనివాస్, తెనాలి

ఉద్యోగాల పేరిట మోసం

రెండున్నరేళ్ల క్రితం హైకోర్టులో జూనియర్ సహాయకులు, సబార్డినేటర్ల పోస్టులు ఇప్పిస్తానని ఓ న్యాయవాది నమ్మబలికాడు. జడ్జిలతో బాగా పరిచయాలు ఉన్నాయని చెప్పాడు. దీంతో లక్షల్లో నగదు చెల్లించాం. ఉద్యోగాల విషయమై అడిగితే ధ్రువీకరణ పత్రాల పరిశీలన జరుగుతుందని, ఈనెల్లోనే ఉద్యోగ నియమాక ఉత్తర్వులు వస్తాయని చెప్పడం మొదలెట్టాడు. అయితే ఈనెల 12న ఆయన చనిపోయారు. దీంతో కుటుంబ సభ్యులను అడిగితే తమకు సంబంధంలేదని చెబుతున్నారు. నలుగురి మీద రూ.15 లక్షలు వరకు చెల్లించాం. న్యాయం చేయగలరు.

– షేక్ అబ్దుల్ జిలాని (ఆర్టీసీ కాలనీ), ఆర్.కె.కె.డి.భవాని, వి.నాగసంధ్యారాణి (వెంగళాయపాలెం), షేక్ నాగుల్‌మీరా (ఏలూరి బజార్, నరసరావుపేట)